ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

గురువారం 12 జూన్ 2025

బడి గంట మోగింది

- నేటి నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు
- పంపిణీకి సిద్ధంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు
- 23,579 మంది విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు
- రూ. 15.81 కోట్లతో భవనాలకు మరమ్మతులు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

బడి గంట మోగింది.. నిన్న, మొన్నటి వరకు వేసవి సెలవుల్లో ఆట పాటల్లో మునిగి తేలిన విద్యార్థులు గురువారం నుంచి పాఠ్య పుస్తకాలతో కుస్తీ పడాల్సి ఉంటుంది. దంచికొట్టిన ఎండల నుంచి ఉప శమనం కలిగించేందుకు తమ కోసమేనన్నట్లుగా కురుస్తున్న చిటపట చినుకులతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. పాఠశాలలకు విద్యార్థులు రానుండడంతో పరిశుభ్రం చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు గత ఏడాది కాలంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా జిల్లాలోని పలు పాఠశాలల్లో తరగతి గదులు, ప్రహరీ నిర్మాణం, ఇతర మరమ్మతు పనులకు 15 కోట్ల 81 లక్షల రూపాయలతో చేపట్టడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు, డ్రాపవుట్స్ సంఖ్యను తగ్గించేందుకు ఎప్పటి లాగానే ఈ ఏడాది 6వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల 19వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనున్నది.

పాఠశాలలకు చేరిన పాఠ్య పుస్తకాలు

జిల్లాలో 358 ప్రాథమిక పాఠశాలలు, 83 ప్రాథమికోన్నత పాఠశాలలు, 108 ఉన్నత పాఠశాలలు, మొత్తం 549 ఉన్నాయి. వీటిలో 24,270 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. 7 మోడల్ స్కూళ్లలో 3,500 మంది విద్యార్థులు, 10 కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయాల్లో 2,806 మంది చదువుతున్నారు. వీరందరికీ ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులను అందజేస్తున్నది. జిల్లాకు 81 టైటిల్స్ గల 2,22,560 పుస్తకాలకు మూడు టైటిల్స్ పుస్తకాలు మినహా 2,18,855 పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరాయి. వాటిని ఇప్పటికే పాఠశాలలకు చేర్చారు. వీటితో పాటు ఉచితంగా ఇస్తున్న నోట్ బుక్కులు కూడా నేరుగా పాఠశాలలకు చేర్చారు. మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ మీడియం రెండు మాధ్యమాలు కలిపి ఉన్న పుస్తకాలను గత రెండేళ్ల నుంచి ఇస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉండే పాఠశాలల విద్యార్థులకు కేవలం ఇంగ్లీష్ మీడియం పుస్తకాలనే ఇస్తున్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియం కలిపి ఉన్న పాఠ్య పుస్తకాలను పార్ట్ 1, పార్ట్ 2 పుస్తకాలుగా విడగొట్టారు. ప్రస్తుతం పార్ట్ 1 పుస్తకాలను సరఫరా చేయగా, పార్ట్ 2 పుస్తకాలు సెప్టెంబర్ నెలలో సరఫరా కానున్నాయని అధికారులు తెలిపారు.

ఏక రూపదుస్తుల పంపిణీ

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పదిహేనేళ్లుగా ప్రతి ఏటా ఉచితంగా రెండు జతల ఏకరూప దుస్తులను ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా అందజేస్తున్నారు. జిల్లాలో 23,579 మంది విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తుల కుట్టు పనిని మహిళా సంఘాలకు చెందిన మహిళలకు

మిగతా 8వ పేజీలో

ఈ ఏడాది నుంచి విద్యార్థులకు ఏఐ పాఠాలు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంచేందుకు, ఈ విద్యా సంవత్సరం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పాఠాలు బోధించనున్నారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఏఐ టూల్స్ గురించి, ఉన్నత తరగతులు అభ్యసించే విద్యార్థులకు ఐఎఫ్‌పీ ప్యానెల్ పాఠాలు బోధించనున్నారు. ఇందుకు వేసవి సెలవుల్లో 2,724 మంది ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. అలాగే వివిధ క్రీడాంశాలు, ఇతరత్రా అంశాల్లో 300 సమ్మర్ క్యాంపులను నిర్వ హించి 3,300 మంది విద్యార్థులకు శిక్షణ అందించామని విద్యా శాఖాధికారులు పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ చట్టాల ప్రాధాన్యం తెలుసుకోవాలి

- న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ స్వప్నరాణి

పెద్దపల్లి రూరల్ , జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల అవగాహణ, వాటి ప్రాధాన్యం తెలుసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ స్వప్నరాణి అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై చట్టాలపై అవగాహన కల్పించారు. ఏవైనా న్యాయ సలహాలు అవసరం ఉంటే న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు సలహాలు అందిస్తారని , ఈ నెల 14న రంగంపల్లి కోర్టులో మెగా లోక్ అదాలత్ కార్యక్రమం చేపట్టను న్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్ యాదవ్, భానుకృష్ణ, సంకీర్తన, న్యాయ వాదులు హనుమాన్ సింగ్, ఝాన్సీ శరత్, గ్రామ పంచాయతి కార్యదర్శి శ్రీని వాస్‌లతో పాటు గ్రామ స్థులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న స్వప్నరాణి

పాఠశాల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్ష చేయించాలి

పెద్దపల్లిటౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యువల్ చేసుకోవాలని జిల్లా రవాణా అధికారి పి.రంగారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభమవుతున్నందున అన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు తమ స్కూల్ బస్సులు, ఇతర వాహనాలకు వాహన సామర్థ్య పరీక్ష చేయించాలన్నారు. ప్రతి స్కూల్ బస్ ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 35కు అనుగుణంగా నిబంధనలు పాటించాలని లేనిపక్షంలో అపరాధ రుసుము, రిజిస్ట్రేషన్ రద్దుకు సిఫార్సు చేయడం జరుగుతుందని అధికారి తెలిపారు.

రేపు పెద్దపల్లికి మంత్రుల రాక

పెద్దపల్లిటౌన్, జూన్11 (ఆంధ్రజ్యోతి) ఈ నెల 13న పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవానికి పెద్దపల్లికి ఇద్దరు మంత్రులు రానున్నట్లు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీవాస్‌రెడ్డిలు ఎలిగేడ్, మహిళా పోలీస్‌స్టేషన్, పెద్దపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లు ప్రారంభించడంతో పాటుడబుల్ బెడ్‌రూం ప్రాంభించి అందజేస్తారని, అలాగే జెండా వద్ద ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్‌తో కలిసి పరిశీలించారు.

ఆసుపత్రుల్లో సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

కళ్యాణ్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లో సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాలు నిత్యం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని గోదావరిఖని ఏసీపీ రమేష్ ఆసుపత్రి సిబ్బంది సూచించారు. బుధవారం గోదావరిఖని ప్రభుత్వజనరల్ ఆసుపత్రితో పాటు సింగరేణి ఏరియా ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆసుపత్రిలో సిబ్బందిపై దాడులు జరుగడం, పుట్టిన పిల్లలను అపహరించుకోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయని, చికిత్స సమయంలో ఎవరైనా మరణిస్తే బంధువులు, కుటుంబ సభ్యులు దాడులకు పాల్పడే అవకాశం ఉంటుందని, ముందస్తు రక్షణ, భద్రతలో భాగంగా ఆసుపత్రిలో సీసీ కెమెరాలను మెయిన్ ఎంట్రన్స్, ఆసుపత్రి ఎంట్రన్స్, ఎమర్జెన్సీ వార్డులు, చిల్డ్రన్ వార్డు, క్యాజువల్ వార్డు, ఎగ్జిట్ ప్రాంతాల్లో తప్పనిసరిగా కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు చూడాలని, పని చేయని కెమెరాలను మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఉన్నారు.



ఖని ఆసుపత్రి వద్ద పరిశీలన జరుపుతున్న ఏసీపీ రమేష్

20న గిరిజన గ్రామాల్లో స్పెషల్ క్యాంపు

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లిటౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జూన్ 20న గిరిజన గ్రామాల్లో స్పెషల్ క్యాంపు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో పీఎం జన్‌మాన్, డిఏజేజియూఏ నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వ సౌకర్యాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మాన్ కార్యక్రమం చేపట్టిందన్నారు. జిల్లాలో గిరిజనులు అధికంగా ఉన్న బట్టుపల్లి గ్రామాన్ని ఎంపిక చేసుకున్నామని, వీటిలో ప్రజలందరికీ తప్పనిసరిగా ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆయుష్మాన్ కార్డు, రేషన్ కార్డు కిసాన్ కార్డు, ఇతర సదుపాయాలను కల్పించాల్సి ఉంటుందన్నారు. ప్రజలందరికీ ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం అందించేందుకు అవసరమైన మీసేవ సెంటర్‌తో సహా సంబంధిత గ్రామాలలో జూన్ 20న క్యాంప్ ఏర్పాటు చేయాలని, అర్హులకు ఎవరికైనా రేషన్‌కార్డు లేని పక్షంలో వారిచే దరఖాస్తు చేయించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాలలో టీచర్ హెల్పర్ అందుబాటులో ఉన్నారా లేదా పరిశీలించాలని లేనిపక్షంలో ఖాళీలు భర్తీ చేసేందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. 6 సంవత్సరాల లోపు గల పిల్లలకు పౌష్టికాహారం అందుతుందో డబుల్ చేక్ చేయాలని సూచించారు. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం క్రింద 100 శాతం టీకాలు వేయించాలని , 102 వాహనాల వినియోగం పరిశీలించాలన్నారు. దివ్యాంగులకు యూడిఐడి నెంబర్ వచ్చేలా చూడాలని, ప్రజలందరికీ జన్ ధన్ యోజన కింద బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేయాలని, పీఎం విశ్వకర్మ ముద్ర స్టాండప్ ఇండియా వంటి వివిధ పథకాల కింద స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు సూచించారు. పోడు భూముల కింద పట్టాలు జారీ చేసిన లబ్ధిదా రులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి ఇందిరా గిరి సౌర జల వికాసం పథకంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కే.సంగీత, జిల్లా అటవీ అధికారి శివయ్య ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ అన్న ప్రసన్నకుమారి

పెద్దపల్లిటౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు ఇప్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్నకుమారి పేర్కొన్నారు. బుధవారం పెద్దపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండు డోసులు కలిగిన రోటాసిల్ వ్యాక్సిన్ వాయిల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ రోటాసిల్ వ్యాక్సిన్‌ను 6 వారాల వయస్సు గల శిశువుకు ఓ.పి.వి. , పెంటా వాలెంట్ యొక్క మొదటి డోసుతో పాటు ఇవ్వాలన్నారు. రెండవ డోసు 10 వారాలకు, మూడవ డోసు 14 వారాల వయస్సు గల పిల్లలకు నోటి ద్వారా 2 ఎంఎల్ డోసు ఇవ్వాలన్నారు. ఈ రోటా సిల్ వ్యాక్సిన్ మూడు డోసులు ఇవ్వాలని, బూస్టర్ డోసు అవసరం లేదని పేర్కొన్నారు. రోటా వైరస్ సోకితే చిన్న పిల్లలలో తీవ్ర నీళ్ల విరేచనాలతో పాటు జ్వరం, వాంతులు, కొన్ని సార్లు కడుపు నొప్పి కూడా ఉండడంతో పాటు నీళ్ల విరోచనాలు అధికంగా కావడం వలన ఆసుపత్రిలో చేర్చవలసిన అవసరం కావచ్చు లేదా మరణం సంభవించవచ్చని తెలిపారు. ఈ వ్యాధి నిరోధక టీకా తప్పకుండా పిల్లలకు వేయించాలని సూచించారు. రోటా వ్యాక్సిన్ వినియోగం వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమములో డా. బి. కిరణ్‌కుమార్, ప్రోగ్రామ్ అధికారి (సి.హెచ్‌అండ్‌ఐ), డా. స్వాతి భాను, వైద్యాధికారి, అఖిల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వ్యాక్సిన్ వేస్తున్న డీఎంహెచ్‌వో

వీధి వ్యాపారులకు సబ్సిడీపై రుణాలు



వ్యాపారులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి

కోల్‌సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులకు సబ్సిడీపై రుణాలను అందించనున్నట్లు రామగుండం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బుధవారం గౌతమినగర్‌లోని వారసంతలో వీధి వ్యాపారస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారుల సంక్షేమం గురించి ప్రభుత్వం అనేక పథకాలు తీసుకువస్తుందని, పీఎం స్వనిధి పథకం ద్వారా సబ్సిడీ రుణం పొంది వ్యాపారాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారి రమేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఊర్మిళ, శ్వేత, ప్రియదర్శిని, శానిటరీ జవాన్ సంపత్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై త్వరగా స్పందించాలి



గర్రెపల్లిలో హమాలీలకు సైబర్‌నేరాలపై అవగాహన కార్యక్రమం

సుల్తానాబాద్, జూన్ 11: (ఆంధ్రజ్యోతి): సమాజంలో సైబర్ క్రైమ్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఇలాంటి ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులు త్వరగా పోలీసులను ఆశ్రయించాలని రామగుండం కమిషనరేట్ షీ టీమ్ మెంబర్ స్నేహలత సూచించారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని సెంట్రల్ వేర్ హౌజింగ్ గోదాముల వద్ద బుధవారం హమాలీలకు షీ టీమ్‌తో పాటు సైబర్ నేరాలపై అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళలు, ఉద్యోగినిలు, విద్యార్థులు ఎవరైనా ఎక్కడైనా వేధింపులకు గురైతే వెంటనే 6303923700 నెంబర్‌కు ఫోన్‌చేసి పోలీసులకు సమాచారం అందిస్తే బాధితులకు సత్వర రక్షణ కలుగుతుందన్నారు. సైబర్‌క్రైమ్ సంఘటనలలో 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలన్నారు. మహిళలు ఎవరైనా ప్రమాదంలో ఉన్నప్పుడు, బెదిరింపులకు గురైపుడు వెంటనే 100కు డయల్ చేయాలన్నారు. ఎస్ఐ లావణ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మౌనిక, నరేష్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

- సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్

సుల్తానాబాద్, జూన్ 11: (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ అన్నారు. వంద రోజుల ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో భాగంగా బుధవారం మున్సిపల్ విలీన గ్రామమైన సుగ్లాంపల్లిలో పర్యటించారు. ఈ గ్రామం పరిధిలోని ఒకటో వార్డులో డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛతపై తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజలందరూ తమ తమ వార్డులను వీధులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి రుగ్మతలకు తావుండదని, తద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్, ఏఈ రాజ్‌కుమార్, వార్డు ఆఫీసర్లు, ఆర్పీలు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ నెల 18న జాబ్‌మేళా

- జిల్లా ఉపాధి కల్పనాధికారి వై.తిరుపతిరావు

పెద్దపల్లి కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువకులకు వివిసి మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 18న బుధవారం రూమ్ నంబర్ 225 నూతన కలెక్టర్ భవన సముదాయంలో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వై.తిరుపతిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిసి మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థలో 60ఈవి సర్వీస్ టెక్నీషియన్, ఆటోమేటివ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, పోస్టులకు 10వ తరగతి, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. వయస్సు 19-30లోపు ఉండాలని, వీరికి వేతనం 12నుంచి 15వేల రూపాయల మధ్య ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 18న ఉదయం 11గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్స్‌లతో నూతన కలెక్టర్ భవన సముదాయంలో పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు ఫోన్ 7729992061, 924626743 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు తెలిపారు.

ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్

పెద్దపల్లి కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ప్రశాంత్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో బాలికల కళాశాల హాస్టల్ సాంక్షన్ అయ్యి మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ప్రారంభించడంలో జిల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు తమ్మనవేణి అభిరామ్, నాయకులు సాయిజనార్ధన్, శివ, నాగచైతన్య, దిలీప్, రోషన్ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక

పెద్దపల్లి కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఉన్న హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ మూడు క్రీడా పాఠశాలల్లో 2025-26 విద్య సంవత్సరానికి ప్రవేశాలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అక్కపాక సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి చదివే బాల, బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని, పాల్గొనే విద్యార్థులు సెప్టెంబర్ 1-2016నుంచి ఆగస్టు 31-2017మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. మండలస్థాయి క్రీడాపోటీలు ఈనెల 16నుంచి 19తేదీల మధ్య జరగనున్నాయని అన్నారు. జిల్లాస్థాయి క్రీడా పోటీలు ఈనెల 23నుంచి 25మధ్య నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు జూలై 1నుంచి జూలై 5వరకు హకీంపేటలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోటీలలో పాల్గొనే విద్యార్థులు ఆధార్‌కార్డు జిరాక్స్, బోనఫైడ్ పత్రాలు ఉండాలని తెలిపారు.

రాజన్న ఆలయ అభివృద్ధిలో సొంత ఎజెండా లేదు

● ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



అభినవ విద్యాతీర్థ సదనం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధిలో తన సొంత ఎజెండా అంటూ ఏమీ లేదని, శృంగేరీ పీఠాధిపతుల సలహాలు సూచనల మేరకే ఆలయాభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని శంకరమఠం వెనుక భాగంలో అనువంశిక అర్చకట్రస్ట్, బ్రహ్మణ నిత్యాన్నసత్రం వారి ఆధ్వర్యంలో అభినవ విద్యాతీర్థ సదనము నిర్మాణం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న క్షేత్రంలో సామాజిక సేవలో బ్రహ్మణుల కోసం ఒక వసతిగృహం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని కొనియాడారు. బ్రహ్మణ వసతి గృహ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాజన్న ఆలయ అభివృద్ధి కోసం శృంగేరి పీఠాధిపతుల సలహాలు సూచనల మేరకే ముందుకు సాగుతున్నామని అన్నారు. అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసకుని ఆలయాభివృద్ధికి ముందుకు సాగుతామన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.150 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఆలయ అభివృద్ధిపై త్వరలోనే పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అందరికీ వివరిస్తామని తెలిపారు. గతంలో ఆలయ చైర్మన్‌గా చేయడం, ప్రస్తుతం ఆలయ అభివృద్ధి చేయడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. ఆలయంలో అడుగు పెట్టడగానే ఒక ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడేలా అభివృద్ధి చేసుకుందామని వివరించారు. అఖిలపక్షంతో పాటుగా ప్రతిఒక్కరి సలహాలు, సూచనలు తీసుకుని ముందుకు సాగుతామని, రాజకీయాలకు అతీతంగా అందరం కలిసికట్టుగా రాజన్న ఆలయ అభివృద్ధిని చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మణ నిత్యాన్నదాన సత్రం గౌరవఅధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, మధు రాదకిషన్, ఈశ్వరగారి నరహరిశర్మ, బుడంగారి మహేష్, పురాణం రాము, మామిడిపల్లి వెంకటేశం, చంద్రగిర శరత్, గోపన్నగారి చందు, నమిలికొండ ఉమేష్ తదితరులు ఉన్నారు.

మానాల ఘాట్ రోడ్డులో టిప్పర్ బోల్తా



ఘాట్‌రోడ్డులో బోల్తా పడ్డ టిప్పర్

రుద్రంగి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండలం మానాల ఘాట్ రోడ్డులో కంకరతో వెళ్తున్న టిప్పర్ బుధవారం ప్రమాదవశాత్తు బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మానాల నుంచి రుద్రంగికి టీఎస్ 16 వీబీ 0789 నంబర్‌గల టిప్పర్ కంకర లోడ్‌తో వస్తుండగా రుద్రంగి మండలకేంద్రం శివారులోని మానాల ఘాట్ రోడ్డులో బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో అదుపుతప్పి బోల్తాపడినట్లు తెలిపారు. ఈ ప్రమాదంతో డ్రైవర్ బుజ్జి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. చికిత్స నిమిత్తం బీమ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి డ్రైవర్‌ను తరలించినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

కరీంనగర్ క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులకు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి బుధవారం అప్పగించారు. హుస్నాబాద్‌కు చెందిన పెండోత లక్ష్మీ, కరీంనగర్ భగత్ నగర్‌కు చెందిన వంశీకృష్ణ, కొత్తపల్లికి చెందిన కనుకం దామోదర్ సెల్‌ఫోన్‌లు పోగొట్టుకొని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ ద్వారా ఫోన్‌లను గుర్తిం చిన పోలీసులు వాటిని రికవరీ చేశారు. ఫోన్‌లను ట్రేస్ చేయడంలో కృషిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

మగ్గిపోతున్న బాల్యం



ప్రచారానికి పరిమితమైన బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం

ఇటుకబట్టీలు, రెస్టారెంట్, హోటళ్లలో వెట్టిచాకిరి

పేదరికంతో ఉజ్వల భవిష్యత్ నాశనం

కరీంనగర్ క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పేదరికంలో మగ్గుతున్న కొన్ని కుటుంబాల్లో పిల్లల భవిష్యత్ అంధకారమవుతోంది. కుటుంబ పోషణ భారమవడం, చదివించడానికి తగిన ఆర్థికస్థోమత లేక పోవడంతో బడికి పంపాల్సిన పిల్లలను పనిలోకి పంపుతున్నారు. మరికొన్ని సంఘటనల్లో తల్లిదండ్రులు లేక అనాథలుగా మారిన పిల్లలు విధిలేని పరిస్థితుల్లో బాలకార్మికులుగా మారుతున్నారు. హోటళ్లు, బార్‌లు, రెస్టారెంట్లు, మెకానిక్ షెడ్‌లు, ఇటుకబట్టీలు, స్టోన్‌క్రషర్, గ్రానైట్ క్వారీలు వంటి సంస్థల్లో బాలకార్మికులుగా పని చేస్తున్నారు. ఇటువంటి పిల్లల కు మంచి భవిష్యత్ అందించాలని ప్రభుత్వాలు చట్టాలను రూపొందించినా అమలుకు నోచుకోవడం లేదు. 18 ఏళ్లలోపు వయస్సు కలిగిన బాలబాలికలను పనిలో పెట్టుకోకూడదు. 15 నుంచి 18 ఏళ్ల వయస్సు పిల్లలను కొన్ని ప్రదేశాల్లో పనిచేసుకోవచ్చని, ప్రమాదకరమైన పనులు చేయకూడదని బాలలు, కౌమార దశ కార్మిక నిషేధం, నియంత్రణ చట్టం-2016 చెబుతున్నది.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం ప్రచారానికే పరిమితమైందని, కేవలం ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం జూన్ 12న మాత్రమే సమావేశాలు ఏర్పాటు చేసి అనంతరం విస్మరిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక వేల బాలకార్మికులుగా పనిచేస్తూ అధికారుల తనిఖీల్లో పట్టుబడితే రూ.25 వేల రూపాయల చొప్పున ఆ సంస్థల యజమానులకు జరిమానా, జైలు శిక్ష విధించేలా చట్టంలో పొందుపరిచారు. జరిమానా రూపంలో వచ్చిన డబ్బులను ఆ బాలుడి పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసేలా పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా హోటళ్లు, బార్‌లు, రెస్టారెంట్లు, మెకానిక్ షెడ్‌లు, ఇటుకబట్టీలు, స్టోన్‌క్రషర్, గ్రానైట్ క్వారీలు వంటి సంస్థల్లో బాల కార్మికులు పనిచేస్తున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

2025 జనవరి నుంచి ఇప్పటి వరకు కరీంనగర్‌లోని చైల్డ్ హెల్ప్‌లైన్ సంస్థ- 1098 నిర్వహించిన తనిఖీల్లో 41 మంది, కార్మికశాఖ మరో 31 మంది బాలకార్మికులను గుర్తించారు. విచారణ చేపట్టి సదరు సంస్థల యజమానులకు జరిమానా విధించారు. గుర్తించిన బాలకార్మికుల్లో స్థానికులతోపాటు ఒరిస్సా, కేరళ, బీహార్ రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు. కొందరు అనాథలను కరీంనగర్‌లోని ఓపెన్ షెల్టర్‌హోంలో, హాస్టల్‌లో చేర్పించారు. మిగతావారిని బడిలో చేర్పించారు. ఇంకొందరిని కౌన్సెలింగ్ అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.

● పోస్టర్ ఆవిష్కరణ

ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కార్మికశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన పోస్టర్‌ను కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ ప్రసాద్, సహాయ కమిషనర్ వెంకటరమణ, ఏఎల్‌వో చక్రధర్‌రెడ్డి పాల్గొన్నారు.



బాల కార్మికులు కనిపిస్తే సమాచారం అందించాలి

ఆవుల సంపత్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కోఆర్డినేటర్



జిల్లాలో బాల కార్మికులు కనపడితే టోల్‌ఫ్రీ నంబరు 1098 లేదా 9490881098కు సమాచారం అందించాలి. 14 సంవత్సరాలకంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను ఏ పనిలోనూ పెట్టుకోకూడదు. 15 నుంచి 18 ఏళ్ల వయస్సు పిల్లలను కొన్ని ప్రత్యేకమైన, ప్రమాదం కానీ పనులు చేయవచ్చు. పాఠశాలలో ఉన్న సమయంలో పిల్లలు పనిచేయరాదు. బాల, బాలికల ఉజ్వలమైన భవిష్యత్‌ను అడ్డుకునే హక్కు ఎవరికీ లేదు. అనాథ బాల కార్మికులను పాఠశాలల్లో చేర్పించి ఉచితంగా హాస్టల్ వసతి కల్పిస్తున్నాం.

రైస్ మిల్లుల్లో అధికారుల తనిఖీలు

మంథని, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరయ్యపల్లి శ్రీలక్ష్మి మాడ్రన్ రైస్‌మిల్లు, దానికి అనుబంధంగా ఉన్న గంగాపురిలోని సత్యసాయి పారాబాయిల్డ్ రైస్‌మిల్లుల్లో సివిల్‌సప్లై ఎన్‌ఫోర్సుమెంట్, టాస్క్‌ఫోర్సు, రెవెన్యూ అధికారులబృందం బుధవారం తనిఖీలు చేశారు. కమీషనర్ ఆదేశాల మేరకు 2025 మార్చి 28న సివిల్ సప్లైకి సంబంధించి 2022-23 సంవత్సరానికి సంబంధించిన ధాన్యం, బియ్యం నిల్వల, 2023-24సంవత్సరానికిగాను ఎఫ్‌సీఐకి సంబంధించిన ధాన్యం, బియ్య నిల్వలపై అధికారులు తనిఖీలు చేశారు. సూరయ్యపల్లిలోని శ్రీలక్ష్మి రైస్‌మిల్లులో తనిఖీ చేయగా నిల్వ ఉన్న ఎఫ్‌సీఐకి సంబంధించిన బియ్యం, ధాన్యం నిల్వలు తనిఖీచేశారు. నాటితనిఖీల్లో గంగాపురిలోని శ్రీసత్యసాయి రైస్‌మిల్లులో తనిఖీ చేయగా 41,365.27క్వింటాళ్ళ ధాన్యంకుగాను 9689.8 క్వింటాళ్ల మాత్రమే లెక్కలోకి వచ్చాయి. మిగితా 31675.47క్వింటాళ్ళ ధాన్యం తేడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈతనిఖీలపై సదురుమిల్లుల యజమాని హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు ఆదేశాల మేరకు అధికారుల బృందం మిల్లుల్లో ఉన్న ధాన్యంనిల్వలపై మళ్లీతనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లోఅధికారుల బృందం పాల్గొంది.

మడేలేశ్వర స్వామి ఆలయంలో చోరీ

జగిత్యాల క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలోని మంచినీళ్లబావి సమీపంలో ఉన్న మడేలేశ్వరస్వామి ఆలయంలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తుతెలియని దొంగలు ఆలయ ప్రధానద్వారం తాళాలు పగులగొట్టి గర్భగుడిలోకి చొరబడి అమ్మవారి మెడలో ఉన్న తులంనర బంగారం, 12తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఆలయ అధ్యక్షుడు దేవరాజం ఇచ్చిన ఫిర్యాదుమేరకు టౌన్ ఎస్సై మన్మధరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇరిగేషన్ ఈఈ శ్రీధర్ అరెస్టు

● కరీంనగర్‌లో అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు ● హైదరాబాద్‌కు తరలింపు

● 5 బృందాలతో బంధువుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు ● పలు కీలక పత్రాలు, బ్యాంక్ డాక్యుమెంట్లు సీజ్



ఈఈ శ్రీధర్ బంధువుల ఇంటిలో తనిఖీలు చేపడుతున్న ఏసీబీ అధికారులు

కరీంనగర్ క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదలశాఖ ఈఈ నూనె శ్రీధర్‌ను ఏసీబీ అధికారులు బుధవారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో అరెస్టు చేశారు. శ్రీధర్ కాళేశ్వరం ప్రాజెక్టు చొప్పదండి-8 డివిజన్‌లో ఈఈగా పనిచేస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని శ్రీధర్‌పై హైదరాబాద్‌లో కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగా మంగళవారం అర్ధరాత్రి కరీంనగర్‌కు చేరుకున్న అధికారులు ఫోన్ లొకేషన్ ఆధారంగా బుధవారం వేకువజామున ఇంటికి వెళ్లి అరెస్టుచేసి హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఏసీబీ డీఎస్పీల ఆధ్వర్యంలో ఐదుబృందాలు కరీంనగర్‌లోని శ్రీధర్ ఇంటిలోనూ, భాగ్యనగర్‌లో ఉంటున్న అతడి మామ, డిగ్రీకళాశాల రిటైర్డ్‌ప్రిన్సిపాల్ ఉప్పు అంజయ్య ఇంటిలోనూ, చొప్పదండిలోని కాళేశ్వరం ప్రాజెక్టు-8 డివిజన్ కార్యాలయంలోనూ, మరి కొన్ని చోట్ల సోదాలు నిర్వహించారు. సోదాల్లో శ్రీధర్ ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పలు డాక్యుమెంట్లు, ఇతర కీలకపత్రాలతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన కొన్ని ఫైళ్లు సీజ్ చేసినట్లు తెలిసింది. ఇక్కడి అధికారులు మాత్రం కేసుకు సంబంధించిన వివరాలను చెప్పలేదు. హైదరాబాద్ అధికారులు వెల్లడిస్తారని తెలిపారు.

● 2016లో ఈఈగా పదోన్నతిపై చొప్పదండికి

వరంగల్‌జిల్లా వెంకటాపూర్ గ్రామానికి చెందిన శ్రీధర్ ఎస్‌ఆర్ ఎస్పీ ప్రాజెక్టులో భాగంగా ఎల్‌ఎండీలో గేజింగ్ డిపార్ట్‌మెంట్‌లో డీఈగా పనిచేశారు. 2016లో ఈఈగా పదోన్నతిపై చొప్పదండి-8 డివిజన్‌కు బదిలీ అయ్యారు. అప్పటినుంచి చొప్పదండిలోనే కాళేశ్వరం ప్రాజెక్టు ఈఈగా విధులు నిర్వహిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభమైన వెంటనే ఎస్‌ఆర్‌ఎస్పీ ప్రాజెక్టు గేజింగ్ డిపార్ట్‌మెంట్‌తోపాటు మరికొన్ని డిపార్ట్‌మెంట్‌ల ఉద్యోగులను కాళేశ్వరం ప్రాజెక్టుకు బదిలీ చేశారు. అప్పటినుంచి చొప్పదండి డివిజన్ ఈఈగా పనిచేస్తున్న శ్రీధర్‌పై అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై విచారణ జరిపిన ఏసీబీ అధికారులు చాలాకాలంగా అతడి కదలికలపై నిఘాపెట్టినట్లు తెలిసింది. ప్రస్తుతం ఏసీబీ అదుపులో ఉన్న ఈఈ శ్రీధర్‌ను హైదరాబాద్ కార్యాలయంలో విచారిస్తున్నారు. విచారణలో వెల్లడైన సమాచారంతో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన మరికొందరు అధికారులపై దాడులు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

● నెలరోజుల్లో ఇద్దరు ఈఈల అరెస్టు

నీటిపారుదల శాఖలో ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్(ఈఈ)లను నెల రోజుల వ్యవధిలో ఏసీబీ అధి కారులు అరెస్టు చేశారు. రాజన్న సిరిసిల్లజిల్లా నీటిపారుదలశాఖ ఈఈ ఎర్రంరెడ్డి అమరేందర్‌రెడ్డి మే9న ఒకకాంట్రాక్టర్ వద్ద 60వేల రూపాయలు లంచం డబ్బులు తీసుకుంటుండగా కరీంనగర్‌లో ఏసీబీఅధికారులు అరెస్టుచేసి కటకటాల్లోకి తరలించారు.

తాజాగా బుధవారం అదేశాఖకు చెందిన ఈఈ నూనె శ్రీధర్‌ను ఆదాయానికి మించి ఆస్తుల కేసులో కరీంనగర్‌లోని స్వగృహంలో అరెస్టు చేశారు.

బీరన్న ఆలయం ఎదుట ఆందోళన

హుజూరాబాద్‌రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీరన్న ఆలయం ఎదుట బుధవారం యాదవకులస్థులు ఆందోళనకు దిగారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీరన్న ఉత్సవాలను జరుపుకుందా మంటే కురుమ కులస్థులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కాగా గ్రామంలో శిథిలావస్థలో ఉన్న బీరన్నఆలయాన్ని పునఃనిర్మించామని, విగ్రహప్రతి ష్ఠాపన జరగకుండా ఉత్సవాలు జరపకూడదని కురుమ కులస్థులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై రెండుకులాల వారు పోలీసులను ఆశ్రయించారు. వేదపండితులు సూచనల మేరకు ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు.



ఆలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న యాదవ కులస్థులు

చికిత్స పొందుతూ గుర్తుతెలియని మహిళ మృతి

యైటింక్లయిన్‌కాలనీ, జూన 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గుర్తుతెలియని మహిళ బుధవారం మృతిచెందింది. ఆరు రోజుల క్రితం గోదావరి నది సమీపంలో అపస్మారక స్థితిలోపడిఉన్న మహిళను పోలీసులు ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ బుధవారం సదరు మహిళ మృతిచెందింది. ఆచూకీ లేని కారణంగామహిళ మృతదేహాన్ని పోలీసులుమార్చురీలో భద్ర పరిచారు.

మస్కట్‌లో ఉరేసుకుని చందుర్తివాసి ఆత్మహత్య



గణేష్ (ఫైల్)

చందుర్తి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఉన్న ఊరిలో ఉపాధి కరువై మస్కట్ వెళ్లిన ఓ యువకుడు అక్కడ అప్పుల బాధతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులకథనం ప్రకారం... మండల కేంద్రానికి చెందిన కత్తి గణేష్(24)అనే యువకుడు మస్కట్ వెళ్లి వస్తున్నాడు. రెండు నెలల క్రితం చందుర్తికి వచ్చి మస్కట్ వెళ్లిన గణేష్ రూమ్‌లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మిత్రులు ఫోన్‌ద్వారా బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతు డి తల్లిదండ్రులు లక్ష్మి-మల్లేశం గతంలోనే అనారోగ్యంతో మృతిచెందారు.

ద్విచక్రవాహనం ఢీ.. చికిత్స పొందుతూ మృతి



దశరథం (ఫైల్)

తంగళ్లపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం జిల్లాల గ్రామానికి చెందిన కోడూరి దశరథం(59) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే... జిల్లెల గ్రామానికి చెందిన దశరథం నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చినఫిర్యాదుమేరకు ద్విచక్ర వాహన దారుడు రామచంద్రపురం గ్రామానికి చెందిన గంధం పరుశురాములపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

ట్రైనీ ఎస్సైని సర్వీస్ నుంచి తొలగించాలి

సుభాష్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలో దళిత యువకుడిపై దాడి చేసిన ట్రైనీఎస్సై భార్గవ్‌ను సర్వీస్ నుంచి తొలగించాలని ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంకటి శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతనెల సైదాపూర్ మండలం సోమారం గ్రామ శివారులో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు బత్తుల మహేందర్ ఆపారని, అదే సమయంలో అతడికి ఫోను రావడంతో మాట్లాడుతుండగా ట్రైనీ ఎస్సై భార్గవ్ కొట్టాడని ఆరోపించారు. ఈవీడియో సోషల్ మీడియాలో కూడా వైరల్ అయ్యిందన్నారు. ట్రైనీ ఎస్సైకి సహకరించిన కానిస్టేబుళ్లపైనా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బౌత్ రాజేందర్‌రెడ్డి, పాక కుమార్, కల్వల రాజు, అరుణ్, మిసాగాల్ల సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

సంపన్న రైతు దేశానికి గర్వకారణం



మాట్లాడుతున్న జాతీయ మాంసకృతుల విభాగ డైరెక్టర్ డాక్టర్ బాబుడే

పాలకుర్తి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సంపన్న రైతు దేశానికి గర్వకారణం అని ఐసీఏఆర్, ఎన్ఎంఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌బీ బాబుడే పేర్కొన్నారు. పాలకుర్తి మండలం కుక్కల గూడూరు గ్రావ టు పంచాయతీ ఆవరణలో బుధవారం రైతులకు కేవీకే రామగిరి ఖిల్లా శాస్త్రవేత్తల బృందం వ్యవసాయ, అనుబంధ రంగాలపై అవగాహన కల్పించారు. పంట ఉత్పత్తి, నేలఆరోగ్యం, శాస్త్రీయవ్యవసాయ పద్ధతులు, సైన్స్‌ఆధారిత సలహాలు, వాతావరణ సూచనలు, పశు,మత్స్య, సాంకేతికతతో నడిచే వ్యవసాయ ప్రోత్సాహ పద్ధతులు, కేంద్ర సబ్సిడీవివరాలు, డిజిటల్ అగ్రికల్చర్ మిషన్, అగ్రిస్టాక్ (రైతు ఐడిలు), నమో డ్రోన్ దీదీ ద్వారా సాంకేతికతతో నడిచే వ్యవసాయంపై అవగాహణ కల్పించారు. కార్యక్రమంలో రామగుండం ఏఎంసీ చైర్మన్ గడ్డం తిరుపతి, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ బస్వారెడ్డి, పౌల్ట్రీ డైరెక్టర్ డాక్టర్ కన్నకి, కెవికె హెడ్ డాక్టర్ ఎ. శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

వాగులను దోచేస్తున్నారు..

● అనుమతికి మించి ఇసుక తరలింపు ● పట్టించుకోని అధికారులు..



పదిర మానేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

ఎల్లారెడ్డిపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలనే నిర్ణయం అక్రమార్కులకు వరంలా మారింది. ఇదే అదనుగా తీసుకున్న వ్యాపారులు ఇసుక దందాకు తెరలేపారు. అధికారికంగా కొంత ఇసుకకు అనుమతులు తీసుకుని అనధికారికంగా పెద్దఎత్తున తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణా లోపం రాజకీయ నాయకుల అండతో ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోంది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గుండారం, సింగారం, రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లతిమ్మాపూర్, అక్కపల్లి, దుమాల, బండలింగంపల్లి, సింగారం, వెంకటాపూర్, కోరుట్లపేట, తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జరుగుతు న్నాయి. వీటితోపాటు స్థానిక అవసరాల కోసం పదిర, వెంకటాపూర్, రాగట్లపల్లి, నారాయణపూర్ గ్రామాల శివారులోని మానేరు వాగు వద్ద ఇసుకరీచ్‌లకు ప్రభుత్వం అనుమతులను జారీ చేసింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక తరలింపునకు రెవెన్యూ అధికారులు అనుమతి పత్రాలను అందిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇందిరమ్మ ఇళ్లకు సరఫరాచేయాల్సిన ఇసుకను అక్ర మార్కులు పక్కదారి పట్టిస్తున్నారు. పెద్దఎత్తున ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నా.. సంబంధిత శాఖ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

● డీడీ డబ్బులు అధికారికి.

మండలంలోని పదిర, వెంకటాపూర్, రాగట్లపల్లి, నారాయణపూర్ గ్రామాల శివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను తరలించేందుకు ప్రభుత్వం ఒక క్యూబిక్ మీటరుకు రూ.160 చొప్పున ఒక్కో ట్రాక్టర్‌కు రూ.480లు ప్రభుత్వానికి డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఇంటి నిర్మాణానికి సంబంధించిన పనుల పత్రాన్ని పంచాయతీ కార్యదర్శి జారీచేస్తే దానిని తహసీల్ కార్యాలయంలో సమర్పించాలి. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం డీడీ డబ్బులను మినహాయించింది. ప్రైవేటు అవసరాల కోసం ఒక రోజు ముందుగానే డబ్బులు చెల్లించిన డీడీతోపాటు ట్రాక్టర్ల నంబర్లు, డ్రైవర్ల ధ్రువీకరణ పత్రాలను అందించాలి. కానీ తహసీల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి అంతా తానే అన్నట్లు వ్యవహరిస్తూ ఇసుక తరలింపునకు ఎన్ని ట్రాక్టర్లు నడుస్తున్నాయో లెక్కగట్టి ఆగ్రామాల ట్రాక్టర్‌సంఘం అధ్యక్షుల ద్వారా తనకు నేరుగా ఫోన్‌పే చేయించుకుంటున్నారనేఆరోపణలున్నాయి.

● గ్రామాభివృద్ధి పేరిట వసూళ్లు

పలు గ్రామాల శివారులోని మానేరు వాగు ఆ గ్రామస్థులకు కాసుల వర్షం కురిపిస్తోంది. కొందరు గ్రామాభివృద్ధి కమిటీ పేరిట వసూళ్ల పర్వానికి తెరదీశారు. గ్రామశివారులోని వాగువద్ద ప్రత్యేకంగా ఇద్దరు వ్యక్తులను నియమించారు. ఒక్కో ఇసుక ట్రిప్పుకు 100 రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం గుర్తించిన ఇసుకరీచ్‌ల గ్రామాల్లో ప్రతి రోజు 20 వేల నుంచి 25 వేల రూపాయల ఆదాయం సమకూరుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

● ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం..

- సుజాత, తహసీల్దార్, ఎల్లారెడ్డిపేట



మండలంలోని గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు పదిర, వెంకటాపూర్, రాగట్లపల్లి, నారాయణపూర్ గ్రామాలతో పాటు లబ్ధిదారులకు అనువైన వాగుల నుంచి ఇసుకకు అనుమతులిస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వానికి డీడీ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రైవేటు అవసరాలకోసం ఇసుకకు ఒక్కో ట్రిప్పుకు 480 రూపాయల డీడీ తీయాలి. నేరుగా డీడీ డబ్బులు తమ కార్యాలయంలోని అధికారికి చెల్లిస్తున్నారనే విషయం మా దృష్టికి రాలేదు. ట్రాక్టర్ సంఘం, గ్రామాభివృద్ధి కమిటీల పేరిట డబ్బులు వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలి. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

రోళ్లవాగు ప్రాజెక్టును సందర్శించిన అటవీ అధికారులు



రోళ్లవాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

బీర్‌పూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని రోళ్ల వాగు ప్రాజెక్టును ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సువర్ణ, నిర్మల్ జోన్ అటవీ అధికారి శర్వానంద బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి సందర్శించారు. అటవీ శాఖ అనుమతులు లేక పనులు నిలిచిపోయాయని రెండు రోజుల క్రితం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌ఆఫ్‌ఫారెస్ట్ సువర్ణను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ విషయమై స్పందించిన ఆమె రోళ్ల వాగును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోళ్ళవాగు ప్రాజెక్టును సందర్శించిన అధికారులు అటవీ శాఖ అనుమతితో పాటు పర్యావరణ అనుమతులు తప్పనిసరి అని తెలియజేశారన్నారు. కవ్వాల్ ఫారెస్టు దగ్గరగా ఉన్న రోళ్లవాగు ప్రాజెక్టులో 800ఎకరాలకుపైగా అటవీప్రాంతం ముంపునకు గురవుతున్న సందర్భంగా ఢిల్లీలో ఉన్న అటవీశాఖ కార్యాలయం నుంచి అనుమతులు తప్పనిసరని అధికారులు తెలిపినట్లు వివరించారు. గతంలోనే నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్‌ను కలిస్తే సానుకూలంగా స్పందించి ఢిల్లీలో అటవీ పర్యావరణ శాఖ అనుమతులు వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో రవి ప్రసాద్, ఇరిగేషన్ అధికారులు నారాయణ రెడ్డి, చక్రు నాయక్, నాయకులు నరేందర్, ప్రభాకర్, హరీష్, రైతులు తదితరులు ఉన్నారు.

14న ఉమ్మడి జిల్లా అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను ఈనెల 14న నిర్వహించనున్నట్లు జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆగమరావు, మురళీధర్‌రావు బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని క్రికెట్ అసోసియేషన్ నెట్స్‌లో ఉదయం 8 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 01-09-2006 తర్వాత జన్మించినవారై ఉండాలని, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పదోతరగతి మెమో, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో కేడీసీఏ నెట్స్‌లో హాజరుకావాలని సూచించారు.

సాహితీహృదిలో నిలువెత్తు రూపం



- హన్మాజీపేట నుంచి జ్ఞాన పీఠంపై 'సినారె'
- నేడు జ్ఞాన పీఠ అవార్డు గ్రహీత సినారె వర్ధంతి

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అలుపెరుగని సాహితీ కృషివలుడు, జ్ఞానపీఠ మెక్కిన డాక్టర్ సి నారాయణరెడ్డి భౌతికంగా లేక పోయినా ఆయన అక్షరం పలకరిస్తోంది. పాటలు మదిని తాకుతూనే ఉన్నాయి. సాహితీవేత్తలు, అభిమానులు, కవులు, రచయితలు, సినారెతో ఉన్న అనుబంధాలను నెమరువేసుకుంటున్నారు. 'ఊపిరాడ లేదు... ఉక్కపోస్తుంది.. ఏసీ గదిలో.. కారణం తెలిసిపోయింది. కవిత రాయలేదు ఇవాలా... రాస్తూరాస్తూ పోతాను... సిర ఇంకిపోయే వరకు.. అంటూ 72ఏళ్లుగా కవిత్వాన్ని, 58ఏళ్లుగా ఆనాటి ఏకవీర చిత్రం నుంచి ఈనాటి అరుంధతి దాకా పాటలను అందిస్తూ..



హన్మాజీపేటలో సినారె ఇల్లు

'మాటకు దండం పెడతా... పాటకూ దండం పెడతా... మాటను, పాటను నమ్మిన మనిషికీ దండం పెడతా...' అంటూ పాట, మాట నా రెండు కళ్లు.. అని చెప్పుకునే హన్మజిపేట ముద్దుబిడ్డ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి నారాయణరెడ్డి 87 వసంతాలు అడుగుపెట్టే క్రమంలోనే జూన్ 12, 2017 అక్షర శిఖరమై నింగికెగిసి ఏడేళ్లు గడిచిపోయాయి. అక్షర శిఖరం... విశ్వంభరుడు... గుబాళించే పాటలు ఎప్పుడూ సాహిత్య జీవనదిగా సాగిపోయిన సినారెకు గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కవులు, రచయితలు, సాహితీ సంస్థలు సాహిత్య కార్యక్రమాలతో నివాళులు తెలపడానికి సిద్ధమయ్యారు. తాను తిరిగాడిన నేల రాజన్న సిరిసిల్ల జిల్లా జ్ఞాపకాల్లో మిగిలిపోగా.. మానేరు ఇసుక తిన్నెలు.. మూలవాగులో ప్రవహించిన పాటలను పాడుకుంటూనే ఉన్నారు.

ఎన్నో సత్కారాలు.. ఎన్నెన్నో అవార్డులు..

డాక్టర్ సి నారాయణరెడ్డి అందుకోని సత్కారాలు లేవు. పొందని అవార్డులు లేవు. అంతేకాకుండా సినారె చేతుల మీదుగా ఎంతో మంది అవార్డులు అందుకోవాలని, సత్కరించుకోవాలని ఆరాట పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఉత్తర అమెరికాలో ఏడుసార్లు పర్యటించగా, తానా, ఆటా సంస్థల కార్యక్రమాలకు వెళ్లి వచ్చారు. సోవియట్ రష్యా, మలేషియా, మారిషస్‌లో కూడా సినారె అక్షర అడుగులు నడిచాయి. అత్యున్నతమైన జ్ఞానపీఠంపైకి నిలువెత్తు అక్షరమై నిలిచిన సినారె అందుకున్న అవార్డులు సత్కారాలు ఎన్నో ఉన్నాయి 1974లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, రాజ్యలక్ష్మి అవార్డు, సోవియట్ ల్యాండ్ అవార్డు, మోహినిదాస్, కోమారన్, 1988లో అత్యున్నత జ్ఞాన పీఠ అవార్డును అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం, భారతీయ భాషా పరిషత్ పురస్కారం, పద్మశ్రీ పురస్కారం, పద్మభూషణ్ పురస్కారం, ఉత్తమ పాటల రచయితగా నంది పురస్కారం, డాక్టర్ బోయి భీమన్న జీవన సాఫల్య పురస్కారం. ఆంధ్ర, కాకతీయ, డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్, మీరట్ నాగార్జున విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లను పొందారు. వివిధ ప్రక్రియల్లో 95కి పైగా పుస్తకాలు రాయగా, సినిమాలకు 3500లకు పైగా పాటలు రాశారు. సినారె సాహిత్యంపై పలు కోణాల్లో తొమ్మిది మంది పీహెచ్‌డీలు చేసి డాక్టరేట్ అందుకోగా, 19మంది ఎంఫిల్ చేశారు. సినారె గ్రంథాలు పలు భాషాల్లోకి అనువాదం జరిగాయి. సినారె హిందీ, ఉర్దూ భాషాల్లో కూడా కవితలు రాశారు.

కుటుంబ నేపథ్యం...

వేములవాడ మండలం హన్మాజీపేట గ్రామంలో జులై 29, 1931లో సినారె జన్మించారు. తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు సినారె. కుటుంబపరంగా భూస్వామ్య వారసత్వమైన ఆ మనస్తత్వం ఇంట్లో ఎవరికి లేదు. తండ్రి నాగలి పట్టి దున్నేవాడు. సినారె మూడో తరగతి వరకు ఊళ్లోనే చదువుకున్నా నాలుగోవ తరగతికి సిరిసిల్ల మానేరు ఒడ్డుకు చేరుకున్నారు. పొరుగూరికి పంపించి చదివించడం తల్లి బుచ్చమ్మకు ఇష్టం లేకపోయినా తండ్రి మల్లారెడ్డి ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదివారు. సినారెను తండ్రి తహసీల్ కార్యాలయంలో క్లర్క్, నాయబ్, తహసీల్దార్‌గా చూడాలని కోరుకున్నాడు. తండ్రి ఇష్టానికి మించి తహసీల్దార్ కాక అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు.

మానేరు ఇసుక తిన్నెలపై అక్షర ప్రవాహం..

సిరిసిల్ల మానేరు తీరాన ప్రాథమిక విద్యను, కరీంనగర్‌లో ఉన్నత పాఠశాల విద్యను అభ్యసించి పై చదువులకు హైదరాబాద్‌కు చేరుకున్నారు. చాదర్‌ఘాట్ కళాశాలలో ఇంటర్మీడియేట్, ఉస్మానియాలో బీఏ ఉర్దూ మీడియంలోనే పూర్తిచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచే తెలుగు సాహిత్యంలో పోస్టు గ్రాడ్యుయేట్, డాక్టరేట్ పొందారు. శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయంలో అనేక గ్రంథాలను చదివారు. 'నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని'... అంటూ సినీ కళా పరిశ్రమలో తన కలం నుంచి జాలువారిన తొలిపాటకు 58 ఏళ్లు నిండాయి. పల్లె నాకు పాటను ఇచ్చింది. పట్నం నాకు మాటను ఇచ్చింది అంటూ డాక్టర్ సినారె పాటకు మాటకు ఉన్న అనుబంధాన్ని చెబుతూ మట్టి వాసనలు వినిపించే జానపదాలు.. రాగాలతో పాటల చెలికాడుగా నిలిచిపోయాడు.



హన్మాజీపేటలో సినారె స్మృతివనం

బస్‌పాస్ చార్జీల పెంపు ఉపసంహరించుకోవాలి



వినతి పత్రం అందిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

భగత్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బస్ పాస్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ రాజుకు ఏఐఎస్‌ఎఫ్ నాయకులు బుధవారం వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్ మాటాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల బస్ పాస్ చార్జీలను పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు కేశబోయిన రాముయాదవ్, నగర నాయకులు పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: రాష్ట్రంలో ఆర్టీసీ.. విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, రోహిత్ అన్నారు. బుధవారం హుజూరాబాద్ డిపోమేనేజర్ రవీంద్రనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 10లక్షలకు పైగా పేద, మధ్యతరగతి, గ్రామీణప్రాంత విద్యార్థులపై పెను భారం పడుతుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ బస్‌పాస్ చార్జీలను పెంచడం సరికాదన్నారు. వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'అడ్లూరి'కి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలు

- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

జగిత్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకు చెందిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖలు కేటాయిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన ముగ్గురు కొత్త మంత్రులకు శాఖలు కేటాయిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జీవో నంబర్ 131 ద్వారా ఉత్తర్వులు వెలువడ్డాయి. బీఆర్‌ఎస్ హయాంలో జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గానికి చెందిన కొప్పుల ఈశ్వర్ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. అయితే జగిత్యాల జిల్లాకు మరోమారు సంక్షేమ శాఖ దక్కడం, అందులోనూ ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రాతినిత్యం వహిస్తున్న ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు దక్కడం విశేషం. గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమ శాఖ మంత్రిగా కొప్పుల ఈశ్వర్ వ్యవహరించగా, ప్రస్తుతం అడ్లూరి లక్ష్మణ్‌కు అదే సంక్షేమ శాఖ కేటాయించడం యాదృశ్చికమైనప్పటికీ ఒకే నియోజకవర్గానికి రెండు పర్యాయాలు మంత్రి పదవి, అవే శాఖల కేటాయింపు జరగడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈనెల 8వ తేదీన మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పదవీ ప్రమాణ స్వీకారం చేయగా బుధవారం శాఖలు కేటాయించారు.



అడ్లూరి లక్ష్మణ్ కుమార్

చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలి



దంపతులకు శిశువును దత్తత ఇస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ పరిధిలోని కరీంనగర్ శిశుగృహంలో పెరుగుతున్న 11నెలల ఆడ శిశువును బుధవారం తమిళనాడుకు చెందిన పిల్లలు లేని దంపతులకు దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇందుకోసం జిల్లా పరిషత్ కార్యాలయ భవనంలోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. జిల్లా సంక్షేమఅధికారి సరస్వతి, డీసీపీవో పర్వీన్, పీవో తిరుపతి, శిశుగృహం మేనేజర్ తేజస్వి, రాజేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సౌకర్యాలు కల్పించాలి

సుభాష్‌నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సౌకర్యాలు కల్పించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలోమాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వపాఠశాలలు, కళాశాలల్లో సౌకర్యాలు లేవనిఆరోపించారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించడంలేదని మండిపడ్డారు. విద్యను వ్యాపారంగామార్చి అధికఫీజులు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే తనిఖీలు చేపట్టాలని, నిబంధనలు పాటించని పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజయ్, రాష్ట్రఉపాధ్యక్షుడు కారుకూరి శ్రీనివాస్, రాష్ట్ర మహిళాఉపాధ్యక్షురాలు మీరియా, నగరఅధ్యక్షురాలు స్వాతి, మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలు కవిత, రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలు బైరి పద్మ పాల్గొన్నారు.

యూరియా ఉత్పత్తికి సన్నద్ధం

- ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో లైట్ అప్ ● 13నాటికి అమ్మోనియా ఉత్పత్తి
- తెలంగాణ రైతాంగానికి ఊరట



ఆర్‌ఎఫ్‌సీఎల్

కోల్‌సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సీఎల్)లో వార్షిక మరమ్మతులు పూర్తయి లైట్ అప్ జరిగింది. రెండు రోజుల క్రితం ఈ ప్రక్రియను ప్రారంభిం చారు. 13నాటికి అమ్మోనియా ఉత్పత్తి ప్రారంభం కానున్నది. యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్న తెలంగాణకు ఆర్‌ఎఫ్‌సీఎల్ వార్షిక మరమ్మతులు పూర్తి చేసుకుని ఉత్పత్తి దశలోకి ప్రవేశపెట్టడం ఊరటనిచ్చినట్లయ్యింది. కీలకమైన హెచ్‌టీఆర్‌ను బైపాస్ చేసి మరమ్మ తులు పూర్తి చేశారు. 3500టన్నుల సామర్థ్యం గల ఆర్‌ఎఫ్‌సీఎల్ హీట్ ట్రాన్స్‌ఫర్ రిఫార్మర్ (హెచ్‌టీఆర్)ను బైపాస్ చేయడం వల్ల కొంత ఉత్పత్తి తగ్గనున్నది. గత ఏడాది ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి తెలంగాణకు 5లక్షల టన్నులయూరియా సరఫరా జరిగింది. ఈ సారి కూడా అదేస్థాయిలో సరఫరా చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర అవసరాల్లో 30శాతంకు పైగా ఆర్‌ఎఫ్‌సీఎలే తీర్చుతుంది. హెచ్‌టీఆర్ బైపాస్‌తో రోజుకు 300నుంచి 350టన్నుల ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంది. సరాసరిరోజుకు 3500టన్నుల ఉత్పత్తి జరుగనున్నది. తెలంగాణలో యూరియా నిల్వలు తక్కువగా ఉండడం, కేంద్రం సరిపడా సరఫరా చేయడంలేదు. ఇదే క్రమంలో ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో మే నెల6వతేదిన ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిపివేశారు. జూన్6న ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్ధేశించుకున్నా సాధ్యపడలేదు. మూడు రోజుల ఆలస్యంతో లైట్‌అప్ చేశారు. 14తరువాత యూరియా ఉత్పత్తి జరిగే అవకాశం ఉంది.కేంద్రప్రభుత్వం కూడా తెలంగాణలో యూరియా కొరతదృష్ట్యా ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి యూరియా సరఫరా చేయాలని ఆదేశాలు జారీచేసిం ది. ఈ క్రమంలో రైల్వేశాఖతో కూడా రేకుల విషయం లోఆర్‌ఎఫ్‌సీఎల్ సంప్రదింపులు జరిపింది. ఈనెల 16 నుంచి అవసరమైన రేకులను అందుబాటులో ఉంచనున్నారు. తెలంగాణలో జూన్, జూలైలో 1లక్ష టన్నుల యూరియా సరఫరా చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. రెండు రోజులకు మూడు రేకుల చొప్పున సరఫరా కాను న్నది. మొదట ఆదిలాబాద్, నిజామాబాద్, ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలకు యూరియా సరఫరా చేయనున్నారు. ఈ జిల్లాల్లో పంటలు ముందుగా వేసే అవకాశం ఉండడంతో ప్రాధాన్యత క్రమంలో సరఫరా చేస్తారు. రాష్ట్ర వ్యవసాయశాఖ కూడా ఎప్పటికప్పుడు ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యాన్నిసంప్రదిస్తుంది. ఇప్పటికే వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపిని రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి పంపింది. అదనపు కోటా కేటాయించాలని ఒత్తిడి పెడుతుంది. ఇప్పటికేనాట్లు వేసి సీజన్ మొదలవుతున్న పరిస్థితుల్లో రైతాంగానికి యూరియా కొరత ఆందోళన కలిగించింది. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి ప్రారంభవుతుండడంతో ఊరట కలుగనున్నది.

ప్రభుత్వ లక్ష్యం.. ఆరోగ్య తెలంగాణ

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



భీమారంలో ఆస్పత్రి భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

భీమారం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. త్వరలోనే భీమారం మండల కేంద్రంలో ప్రభుత్వ పక్కా భవనాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. భీమారం మండల కేంద్రంలో బుధవారం రూ.కోటి 43 లక్షల నిధులతో 30 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం విప్ భూమి పూజ నిర్వహించారు. అనంతరం 97 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, 27 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నాయకులు బక్క్యారి నరేష్, ఉత్కం శంకర్ గౌడ్, చెక్కపెల్లి సంజీవ్, బొమ్మెన ప్రశాంత్, అంగడి ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిని ప్రారంభించిన విప్..

మేడిపల్లి, జూన్ 11: మేడిపల్లి మండలంలోని వల్లంపెల్లిలోని కాకతీయ కెనాల్‌పై రూ.2 కోట్ల 50 లక్షలతో నిర్మించిన బ్రిడ్జిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వల్లంపల్లి వాసులు ఎదురు చూస్తున్న బ్రిడ్జి అందుబాటులోకి రావడం సంతోషకరం అన్నారు. మేడిపల్లి మండల కేంద్రానికి మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం తరగతులు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విప్ సూచించారు. కార్యక్రమలో కాంగ్రెస్ నాయకులు రమేష్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వినోద్, బొంగోని రాజా గౌడ్, నాగరాజు, జలందర్, నవీన్‌రెడ్డి, గంగారెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలి

హుజూరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు, రచయిత, గాయకుడు నేర్నాల కిశోర్ అన్నారు. బుధవారం హుజూరాబాద్‌లో ఈనెల15న కరీంనగర్‌లోని కళాభారతిలో ఉదయం 10నుంచి రాత్రి 10గంటల వరకు జరిగే పాటలపల్లకిలో కార్యక్రమ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక చాలామంది కళాకారులకు న్యాయం జరగలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కళాకారులను ఆదుకొని ఉద్యోగాలు కల్పించాలన్నారు.

380 రాజన్న కోడెల పంపిణీ

వేములవాడ కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి గోశాలలోని కోడెల పంపిణీ కొనసాగుతుంది. కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆధ్వర్యంలో బుధవారం అర్హులైన రైతులకు కోడెలను పంపిణీ చేశారు. ముందుగా దరఖాస్తు చేసుకున్న రైతుల ధ్రువపత్రాలను పరిశీలించి అనంతరం 380 కోడెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజన్న కోడెలను పొందిన రైతులు కోడెల సంరక్షణపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. వ్యవసాయ పనులకు మాత్రమే కోడెలను ఉపయోగించుకోవాలని తెలిపారు. రైతులు పొందిన కోడెలు పక్కదారి పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే కోడెల స్థితిగతులపై ఆరా తీస్తారని చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి, పశువైద్యాధికారితో పాటుగా ఆలయ అధికారులు ఉన్నారు.



కోడెలకు దరఖాస్తు చేసుకున్న రైతుల పత్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్

వైభవంగా గోవుల కల్యాణ మహోత్సవం

- ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

ఓదెల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి క్షేత్రంలో బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా వృషభ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అధికసంఖ్యలో తరలివచ్చిన మహిళలు మంగళహారతులతో, వేదమంత్రోచ్ఛరణలతో గోమాతలకు కళ్యాణాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఆవు, దూడను పెళ్లికూతురుగా, పెళ్లికొడుకుగా వేషధారణతో అలంకరించి, మేళతాళాలతో ఆలయం వరకు శోభయాత్ర నిర్వహించారు. అనంతరం రెండింటికి పంచముఖ హనుమాన్ పీఠం పరబ్రహ్మ నందగిరి స్వామి సమక్షంలో వివాహ తంతును నిర్వహించారు. కల్యాణాన్ని గ్రామస్థులు ఆసక్తిగా తిలకించారు.



ఓదెల సీతారామచంద్రస్వామి ఆలయంలో గోవులకు కల్యాణాన్ని నిర్వహిస్తున్న నందగిరి స్వామి

● ఇంటికొక ఆవును పోషించండి..

\- పరబ్రహ్మ నందగిరి స్వామి

గ్రామాలు, దేశం సుభిక్షంగా, సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉండాలంటే ఇంటికొక పాడి ఆవు, గేదెలను పోషించుకోవాలని కరీంనగర్ పంచముఖ హనుమాన్ పీఠం పరబ్రహ్మ నందగిరి స్వామి అన్నారు. గోమాతల కళ్యాణ మహోత్సవం పూర్తి అనంతరం నందగిరిస్వామి మాట్లాడుతూ, గోవుల పంచమూత్రాలను ఎవరైతే ఉపయోగిస్తారో ఆఇంటిలో ఎలాంటి అనారోగ్యం దరిచేరదన్నారు. స్వచ్ఛమైన ఆవుపాలు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయన్నారు. కార్యక్రమంలో నల్ల ఫౌండేషన్ అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, అలాగే ఆర్ఎస్ఎస్, హిందువాహిని, చిరుతలరామాయణ భక్తబృందం, భ్రమరాంబిక సేవాసమితిసభ్యులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణకు ఘన సన్మానం


వంశీకృష్ణను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

సుల్తానాబాద్, జూన్ 11: (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణకు బుధవారం సుల్తానాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. తన తండ్రి వివేక్‌కు మంత్రి మండలిలో చోటు లభించిన అనంతరం ఢిల్లీ పెద్దలను కలసి కృతజ్ఞతలు తెలిపినట్లు ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు సీరటి శంకర్ ఆధ్వర్యంలో నాయకులు కనుకుంట్ల శ్రీనివాస్, చొప్పరి రాజలింగు, సాయికిరణ్, స్వామి తదితరులతో పాటు సీనియర్ నాయకులు ఎండీ అమీనొద్దిన్ నన్ను, ముస్తాఫా, ముస్త్యాల రవీందర్, బొల్లి ప్రేమ్, రాము తదితరులు స్వాగతం పలికారు.

ప్రైవేటు పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు రాయితీ ఇవ్వాలి

పెద్దపల్లిటౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పెద్దపెల్లి జిల్లాలోని వివిధ దినపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులో 50 రాయితీ కల్పించాలని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్షకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ప్రతినిధులు కోరారు. బుధవారం యూనియన్ జిల్లా అధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు నారాయణదాసు అశోక్, పెద్దపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చింత కింది చంద్రమొగిలి, పెద్దపల్లి మండల శాఖ అధ్యక్షులు వీరమల్ల విద్యాసాగర్, జర్నలిస్టులో ఎండి గౌస్ బాషా, ఎండి ఇబ్రహీంలు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ శారదను కలిసి వినతిపత్రం అందజేశారు.

కొప్పుల 'ఒక ప్రస్థానం' పుస్తక పరిచయ వేదిక

ధర్మారం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విప్లవ, సామాజిక, రాజకీయ ప్రయాణం గురించి తెలుపుతూ రచించిన 'ఒక ప్రస్థానం' పుస్తక పరిచయ వేదికను బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. పార్టీ మండల అధ్యక్షులు రాసూరి శ్రీధర్ పుస్తక పరిచయం చేశారు. నూతి మల్లన్న రచించిన ఈ పుస్తకంలో కొప్పుల బాల్యం నుంచి మొదలుకొని పూర్తి సమాచారాన్ని పుస్తకంలో పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో పూస్కూరి జితేందర్‌రావు, ముత్యాల బలరాంరెడ్డి, గుర్రం మోహన్‌రెడ్డి, పూస్కూరి రామరావు, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, కూరపాటి శ్రీనివాస్, కాంపెల్లి చంద్రశేఖర్, పాకాల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటాలి


సమావేశంలో మాట్లాడుతున్న కనకరాజు

కళ్యాణ్‌నగర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటాలని సీపీఐ నగర కార్యదర్శి కే కనకరాజు అన్నారు. బుధవారం 10వ డివిజన్ రాంనగర్‌లో నిర్వహించిన మహా సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశంలో వంద సంవత్సరాలు నిండిన ఏకైక పార్టీ సీపీఐ అని, అనేక ప్రజా సమస్యలు, కార్మిక సమస్యలపై పోరాటం చేసి హక్కులను సాధించిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో సీపీఐ అత్యధికంగా డివిజన్లను కైవసం చేసుకునే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. చిందం భూమయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావే శంలో నాయకులు గోషిక మోహన్, తాళ్లపల్లి మల్లయ్య, శనిగరపు చంద్రశేఖర్, మార్కపురి సూర్య, నవీన్, కొమురయ్య పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి

● జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య

జూలపల్లి, జూన్ 11. (ఆంధ్రజ్యోతి) గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై కార్యదర్శులు ప్రత్యేకంగా దృష్టిసారించి సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను రక్షించాలని జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య అన్నారు. మండలంలోని వడుకాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. కార్యాక్రమంలో ఎంపీవో అనిల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, పలువురు సిబ్బంది ఉన్నారు.

గోమాతకు ప్రత్యేక పూజలు

జూలపల్లి, జూన్ 11.(ఆంధ్రజ్యోతి) మండలంలోని కుమ్మరికుంట గ్రామంలో గల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని గ్రామస్థులు, భక్తులు కలిసి గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవులను ప్రత్యేకంగా అలంకరించారు. ఈకార్యక్రమంలో కామ రాజు, వెంకటనివాస్, దిడ్డి శంకరయ్య, సాదుల రాజయ్య, కుంట రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖనిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

కోల్‌సిటీటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అడ్డగుంటపల్లిలోని వైశ్యభవన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సోమాజిగూడ యశోద హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఈవైద్య శిబిరంలో ఆంకాలాజీ వైద్యులు బల్మూరు నివేదరావు, ఆర్థో డాక్టర్ సునీల్ దాచేపల్లి, గుండె సంబంధిత వైద్యులతో సుమారు 500 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి అధ్యక్షులు నార్ల ప్రసాద్, ప్రధానకార్యదర్శి మామిడిపల్లి శ్రీధర్, కోశాధికారి కోదాటి ప్రవీణ్, జయప్రకాష్‌చౌడ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

కోల్‌సిటీ టౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సర్వేష్ డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ సిల్వర్ జూబ్లీ వేడుకలు బుధవారం గోదావరిఖని మార్కండేయ కాలనీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వేడుక లను ప్రారంభించారు. 25 ఏళ్లుగా గోదావరిఖని ప్రాంతంలో డ్యాన్స్ కళాకారులను తీర్చిదిద్దుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిం చేలా కృషిచేస్తున్న సర్వేష్ డ్యాన్స్ నిర్వాహకులను అభినందించారు. జబర్దస్త్ ఫేమ్ వరుమణి వర్షిణి, టోనికక్, ఎస్‌వీఆర్, గౌరేష్ సుదర్శన్, సరిత ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాప కులు సర్వేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయ కులు కాల్వలింగ స్వామి, మహంకాళిస్వామి, బొంతల రాజేష్, తిప్పారపు శ్రీనివాస్, ఉపేందర్, పీఎస్ అమరేందర్, దయానంద్‌గాంధీ, దామెర శంకర్, సంకె రాజేష్, మంథని సంపత్, కనకం రమణయ్యలతో పాటు అధిక సంఖ్యలో కళాకారులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ప్రజా ప్రభుత్వం

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


చెక్కు పంపిణీ చేస్తున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఈ సీజన్ వడ్ల కొనుగోలు అత్యంత వేగంగా చేసి రికార్డు సృష్టించినప్పటికీ, ఒక హమాలీ కూలి బిడ్డ చనిపోవడం బాధాకరమని, బాధితులకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం వ్యవసాయ మార్కెట్‌లో హమాలీగా పనిచేసిన మెడవేని రాజేశం ఏప్రిల్ 29న ప్రమాదవశాత్తు మృతి చెందగా ఆ కుటుంబానికి ఆర్థికసాయం చెక్కును కలెక్టర్ కోయశ్రీ హర్షతో కలిసి అందజేశారు. అంతకు ముందు మండలంలోని చామనపల్లి గ్రామంలో మంగళవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై 52 గొర్రెలు చనిపోగా యాదవ కుటుంబాలను కలిసి పరామర్శించారు. ప్రమాద వివరాలను గొర్రెల కాపరులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యాదవ కుటుంబాలు మంత్రిని చూసి కన్నీరు పెట్టుకోగా వారికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి చనిపోయిన గొర్రెలన్నింటికి నష్ట పరిహారం ఇవ్వాలని సూచించగా 30 రోజుల్లో అందిస్తామని ట్రాన్స్‌కో అధికారులు హామీ ఇచ్చారు. ఇంతలో కలెక్టర్ కోయశ్రీ హర్ష కలుగజేసుకొని 10 రోజుల్లో బాధిత కుటుంబాలకు నష్టపరిహార చెక్కును అందేలా చూడాలని సూచించారు. చెక్కు పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పీఎం కుసుమ్ పథకానికి నందిమేడారం ఎంపికైందని త్వరలోనే 4 కోట్లతో సోలార్ ప్లాంట్ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సారి గత రెండు మూడు సంవత్సరాలతో పోల్చితే అంతకు రెట్టింపు ధాన్యం కొనుగోలు చేసి 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేశామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ కమిటి ఛైర్ పర్సన్ ఈర్ల స్వరూప, డీసీఓ శ్రీమాల, డీఎంఓ ప్రవీణ్‌రెడ్డి, మేడారం ప్యాక్స్ ఛైర్మెన్ ముత్యాల బలరాంరెడ్డి, సెక్రెటరీ సరోజ, ఏఎంసీ ఛైర్మెన్ లావుడ్య రూప్లానాయక్, మండల అధ్యక్షులు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, బ్లాక్-2 అధ్యక్షులు కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రాజయ్య

సుల్తానాబాద్, జూన్ 11: (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తరగతి గదులను వాటిని రోజుకు రెండు సార్లు శుభ్రం చేయాలని మండల విద్యాధికారి అరేపల్లి రాజయ్య అన్నారు. సుల్తానాబాద్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సలహాలు సూచనలు అందించారు. పారిశుధ్య సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో హెచ్‌ఎం రత్నాకర్ రెడ్డి, ఎమ్మార్పీ కిషన్, సీఆర్పీలు సదానందం, రామచంద్రం, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం: పాఠశాలల ప్రారంభం కానున్నందున ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలకు రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. పాఠశాల నిర్వహణపై బుధవారం మధ్యాహ్న భోజన నిర్వాహకులతో పాటు స్కావెంజర్లకు మండల కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. పౌష్టికాహారం అందించడంతోపాటు పరిసరాల పరిశుభ్రతపై శిక్షణ ఇచ్చినట్లు మండల విద్యాధికారి ప్రభాకర్ తెలిపారు.

కాల్వశ్రీరాంపూర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని ఎంపీడీవో పూర్ణచందర్‌రావు కోరారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని హైస్కూల్‌లో నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యను అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విశేష బోధనానుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నారని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పి, ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేసి, ప్రభుత్వ పాఠశాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు. అనంతరం పిల్లలకు ఉచిత దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సిరిమల్లి మహేష్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ముత్తారం: కృత్యాధార అభ్యసనతో విద్యార్థుల్లో ప్రతిభను పెంపొందించాలని ఎంఈవో హరిప్రసాద్ అన్నారు. మండలంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు.

ఎలిగేడు: ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత ఫలితాలకోసం నిరంతరం ఉపాధ్యాయులు శ్రమించాలని ఎంఈవో అనసూరి నరేంద్రచారి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం గండ్ర దేవేందర్‌రావుల అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రణాళిక, పరిశుభ్రతపై శిక్షణ నిర్వహించారు.

మంథని: మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు, పారిశుధ్య, మధ్యాహ్నం భోజన సిబ్బందికి పలు అంశాల పై వేర్వురుగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మి, ఆర్పీలు లోకే రాజ్‌పవన్ పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో చీడపీడలు దూరం

పెద్దపల్లి రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటలు సాగు చేసే ముందు విత్తన శుద్ధి చేస్తే చీడ పీడలు దరిచేరకుండా ఉంటాయని కునారం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ సిద్ధి అన్నారు. బుధవారం మండలంలోని హన్మంతునిపేతటలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు - రైతులకు అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటలలో యూరియా వాడకాన్ని తగ్గించాలని, అవసరం మేరకే పురుగుల మందులు పిచికారి చేయాలన్నారు. మండల ఉద్యాన వన శాఖ అధికారి మహేష్, ఏవో అలివేణి రైతులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదు


కనగర్తిలో ఇళ్ల ప్రొసీడింగ్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే

ఓదెల, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎవరైనా అవినీతికి పాల్పడినట్లు దృష్టికి వస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. మండలంలోని కనగర్తిలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. అలాగే గృహ నిర్మాణం కోసం ముగ్గు పోసి నిర్మాణాలను ప్రారంభించారు. అనంతరం ఇక్కడున్న ప్రాచీన కాలం నాటి చెన్నకేశవ స్వామి ఆలయాన్ని దర్శించి పూజలు నిర్వహించారు. అలాగే నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజమైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇల్లు వర్తించాలని, ఇందుకోసం ఇందిరమ్మ కమిటీలు నిజాయితీగా నిర్ణయించి గ్రామస్థుల మన్ననలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, ఎంపీడీవో తిరుపతి, చొప్పరి రాజయ్య, ఉడిగె సదయ్య, కసిరెడ్డి మహేందర్ రెడ్డి, మచ్చ నర్సింగరావు,జాగిరి కిషోర్, తాళ్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనుబాబును కలిసిన నాయకులు


అభినందనలు తెలుపుతున్న బాలాజీ, గీతారాణి

ముత్తారం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నూతనంగా తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియామక మైన దుద్దిళ్ల శ్రీనుబాబును ముత్తారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, అడవి శ్రీరాంపూర్ తాజా మాజీ ఎంపీటీసీ దొడ్డ గీతారాణి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనుబాబుకు అభినం దనలు తెలిపారు.

ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచ దేశాలకు వణుకు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హరీష్‌బాబు

పెద్దపల్లి టౌన్, జూన్11 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో ప్రపంచ దేశాలకు వణుకు పుట్టిందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ బటన్ నొక్కితే రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయని, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బటన్ నొక్కితే రైతుల ఖాతాలు ఖాళీ అవుతాయని అన్నారు. నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా 70 రోజులపాటు వికసిత్ భారత్ పేరున కార్యక్రమాలనుచేపడుతున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనులను ఈ- టెండర్ల ద్వారా నిర్వహిస్తూ అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. ఆచరణ సాధ్యంకాని ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను నిలువునా మోసం చేసిందని విమర్శించారు. నాయకులు కందుల సంధ్యా రాణి, కడారి అశోక్‌రావు, సదానందం పాల్గొన్నారు.



ఆర్‌జీ-1 ఏరియాలో డ్రైనేజీ వ్యవస్థకు మరమ్మతులు చేయాలి


బస్టాండ్ కాలనీలోని పరిశీలన జరుపుతున్న డీజీఎం(సివిల్)

గోదావరిఖని, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్‌జీ-1 ఏరియాలోని గోదావరిఖని బస్టాండ్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని బుధవారం సింగరేణి ఆర్‌జీ-1 సివిల్ డిపార్ట్‌మెంట్ డీజీఎం దృష్టికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ తీసికెళ్లగా, డీజీఎం(సివిల్) వెంటనే బస్టాండ్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా డీజీఎం(సివిల్) డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్‌జీ-1 బ్రాంచి ఆఫీస్ బేరర్ సోహెల్, దాసరి శ్రీనివాస్, బొల్లి శ్రీనివాస్, సివిల్ సూపర్‌వైజర్ బక్కిరెడ్డి, వెంకటేష్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లి రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి తహసీల్దార్ రాజయ్య అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో పలు భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను తహసీల్దార్ రాజయ్య స్వీకరించారు. కార్యక్రమంలో రెవె న్యూ ఇన్‌స్పెక్టర్ వెంకట రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పుట్ట శ్రీనివాస్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పాలితం గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ విజేందర్ తన బృందంతో సదస్సు నిర్వహించిన ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు.

ముత్తారం: భూభారతితో భూసమస్యలు పరిష్కారం అవుతాయని ముత్తారం తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పారపల్లిలో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతితో భూసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి 2025ఆర్‌ఓఆర్ చట్టం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.రైతులు తమ సమస్యలను రాతపూర్వకంగా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

సింగరేణి ఉద్యోగులకు ప్రమాదబీమా పథకం

ఇది ఒక చరిత్రాత్మక ఘట్టం : సింగరేణి సీఎండీ ఎన్ బలరాం



ఒప్పందం చేసుకుంటున్న సింగరేణి సీఎండీ బలరామ్

గోదావరిఖని, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సూచన మేరకు కార్మిక సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఇప్పటికే రూ.1కోటి ప్రమాద బీమా పథకం అమలు చేస్తున్నప్పటికీ, పంజాబ్ నేషనల్ బ్యాంక్ ద్వారా సింగరేణి సంస్థ బుధవారం కుదుర్చుకున్న రూ.1.25కోట్ల ప్రమాద బీమా పథకం ఒక చారిత్రక ఘట్టమని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో పంజాబ్ నేషనల్ బ్యాంకుతో ఈ ఒప్పందం కుదిరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రమాదవశాత్తు కార్మికులు మృతి చెందినప్పుడు కంపెనీ ఇస్తున్న సహాయం కొంత ఉన్నప్పటికీ వారి కుటుంబాలకు మరింత ఆర్థిక భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో బ్యాంకులతో మాట్లాడి ఈ తరహా ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే అమలవుతున్న పథకాల వల్ల కార్మికుల కుటుంబాలకు గట్టి ఆర్థిక భరోసా లభించిందని అన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ వారు కూడా మిగిలిన బ్యాంకుల అన్నిటికన్నా ఎక్కువగా రూ.1.25 కోట్ల బీమా పథకాన్ని అమలు చేయడానికి ముందుకు రావడం, అలాగే సాధారణ మరణం సంభవించిన వారికి రూ.10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్‌ను కూడా పంజాబ్ నేషనల్ బ్యాంక్ అమలు చేయడం ఎంతో సంతోషకరమన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ద్వారా సింగరేణి పొరుగు సేవల ఉద్యోగుల కోసం రూ.40లక్షల ప్రమాద బీమా ఒప్పందాన్ని కూడా అమలు చేస్తుందన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈఓ అండ్ ఎండీ అశోక్‌చంద్ర మాట్లాడుతూ సింగరేణి సంస్థతో తాము కుదుర్చుకున్న ఈ ఒప్పందం ఇతరులకు కూడా ఆదర్శప్రాయమని అన్నారు. ఈ పథకం 13 నుంచి నుంచి సింగరేణి ఉద్యోగులకు అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ తరపున డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారా యణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్‌డీ ఎం సుభాని పాల్గొన్నారు.

ఖనిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కోల్‌సిటీటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖని ప్రశాంత్‌నగర్ హనుమాన్ దేవాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ధూప దీప నైవేద్య అర్చకులకు అర్చక వెల్ఫేర్ బోర్డు ద్వారా రావాల్సిన ఫలాలను అందించడం కోసం కరపత్రం విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నిట్టూరి సతీష్‌శర్మ, ఉపాధ్యక్షులు కాందూరి దామోదరచార్యులు, జిల్లా ఉపాధ్యక్షులు వేటూరి శ్రావణ్‌కుమార్, ఆచార్యులు పాల్గొన్నారు.

బడి గంట మోగింది

(5వ పేజీ తరువాయి)

అందజేశారు. జిల్లాలో 359 మంది మహిళలకు 27 కేంద్రాల ద్వారా కుట్టు శిక్షణ ఇప్పించి వారిచే ఏక రూప దుస్తులను కుట్టించారు. ఈ కేంద్రాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఎప్పటికప్పు డు సందర్శించి బట్టలను సకాలంలో కుట్టే విధంగా చర్యలు తీసుకు న్నారు. దుస్తులు పాఠశాలలకు చేరాయి. గత ఏడాది డైస్ ప్రకారం దుస్తులు కుట్టించగా, అంతకంటే ఎక్కువ విద్యార్థుల సంఖ్య పెరిగితే యుద్ధ ప్రాతిపదికన దుస్తులు కుట్టిస్తామని విద్యా శాఖాధికారులు పేర్కొన్నారు. పండుగ వాతావరణంలో పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, ఏకరూప దుస్తులను పంపిణీ చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 30,321 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేయగా, ఈ సంఖ్య గత విద్యా సంవత్సరం నాటికి 24,270 మంది విద్యార్థులకు పడిపోయింది. దాదాపు 6 వేల మంది విద్యార్థుల్లో కొందరు గురుకుల విద్యాలయాలకు వెళ్లగా, మరి కొందరు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లారు. ప్రతి ఏటా బడిబాట నిర్వహిస్తున్నా కూడా విద్యార్థుల సంఖ్య తగ్గుతూనే ఉన్నది.

న్యూస్ బాక్స్

డివిజన్ల పునర్విభజనపై కమిషనర్‌తో ఆర్‌జేడీ భేటీ

కోల్‌సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో డివిజన్ల పునర్విభజనపై బుధవారం రామగుండం కమిషనర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అరుణశ్రీతో పురపాలక ప్రాంతీయ సంచాలకులు షాహిద్ మసూద్ భేటీ అయ్యారు. డివిజన్ల విభజనకు సంబంధించి ప్రజల నుంచి వస్తున్న సలహాలు, సూచనలు, ఆక్షేపణల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ విభాగం అధికారులతో సమావేశమై డివిజన్ల విభజన ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఈఈ రామన్, పట్టణ ప్రణాళిక అధికారి నవీన్, రెవెన్యూ ఆఫీసర్ ఆంజనేయులు, ఆర్‌ఐలు శంకర్‌రావు, ఖాజా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుమారస్వామి ఉన్నారు.

అవార్డు అందజేత

కమాన్‌పూర్, జూన్11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కళామందిరంలో స్ఫూర్తి అవార్డును తీసుకున్నారు. నల్లవెల్లి శంకర్ లయన్స్‌క్లబ్ మండల ప్రధానకార్యదర్శిగా ఎన్నో సేవా కార్యక్రమాలు అందించడంతో వసుంధర విజ్ఞాణ వికాస మండలి ద్వారా స్ఫూర్తి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును సంస్థ 32వ వార్షికోత్సవం సందర్భంగా సంస్థ మండలాధ్యక్షుడు చదువు వెంకటరెడ్డి వారి తండ్రి మల్లారెడ్డి జ్ఞాపకార్థం ప్రదానం చేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మధు ధర్మారెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు.

శ్రీ రంగనాథ స్వామి బ్రహోత్సవాలు

పెద్దపల్లి రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోంపల్లి గ్రామంలో శ్రీ భూ గోదా సమేత శ్రీ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను పూల మాల, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.